లెక్సస్ నుంచి కొత్త ఆర్ఎక్స్ ఎక్విసిట్

- ధర రూ.89.99 లక్షలు

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఇండియా కొత్తగా ఆర్ఎక్స్ శ్రేణిని విస్తరించినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా కొత్త ఆర్ఎక్స్ ఎక్విసిట్ గ్రేడ్ ఆర్ఎక్స్ 350హెచ్ వేరియంట్‌ను బుధవారం ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.89.99 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో హైఎండ్ మోడల్ ఆర్ఎక్స్500హెచ్ ఎఫ్ స్పోర్ట్ ధరను రూ.1,09,46,000గా ప్రకటించింది.

మోటోరోలాతో ఇండస్ యాప్‌స్టోర్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ల తయారీదారు మోటోరోలాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు స్వదేశీ ఆండ్రాయిడ్ యాప్ మార్కెట్ ప్లేస్ అయిన ఇండస్ యాప్‌స్టోర్ తెలిపింది. దీంతో దేశంలో విడుదలయ్యే మోటోరోలా పరికరాల్లో ఇండస్ యాప్‌స్టోర్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ ఒప్పందం కుదిరిందని పేర్కొంది. ఇండస్ యాప్‌స్టోర్ అనేది 12 భారతీయ భాషలు అలానే ఇంగ్లీష్‌లో అందుబాటులో ఉందని తెలిపింది.

ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో మందుల కొరత

ప్రజాశక్తి బి హైదరాబాద్ బ్యూరో

ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో మందుల కొరత తో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో డాక్టర్లు రాసిన మందులు లేకపోవటంతో బయట దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి రావటంతో పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి, పేషెంట్లు ఇదేం కర్మ రా బాబు అని వాపోతున్నారు, దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. మమత కస్తూరి మాట్లాడుతూ పై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. సమస్య త్వరలో పరిష్కారమవుతుందని చెప్పారు.

ఎల్‌బి నగర్ పిఎస్‌లో గుండెపోటుతో ఎస్ఐ మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే గుండెపోటుతో ఓ ఎస్ఐ ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్ ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సతార్ జిల్లాకు చెందిన సంజయ్ సావంత్ (58) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నాచారంలో నివాసముంటున్నారు. రెండు సంవత్సరాలుగా ఎల్‌బి నగర్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బుధవారం డ్యూటీ పడింది.

పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుమతివ్వండి

- మెట్రో రెండో దశ విస్తరణకు సహకరించండి
- కేంద్రాన్ని కోరిన తెలంగాణ ప్రభుత్వం
- మోడీకి రేవంత్ గ్లోబల్ సమిట్ ఆహ్వానం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగుళూరు హై స్పీడ్ కారిడార్ ను అభివృద్ధి చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని ప్రధాని మంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరాయంగా రవాణా సదుపాయం ఉండేలా టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఫోర్ లేన్ ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించాలని మోడీకి వినతిపత్రం అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలంటూ ప్రధాని మోడీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. బుధవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్... ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో సిఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎంపిలు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా .. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని సిఎం ప్రధానికి వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు చెప్పారు.

నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్ లో ఆవిష్కరించనున్నట్లు సిఎం ప్రధానికి వివరించారు.

తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహాకారాలు అందించాలని సిఎం ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు తగిన అనుమతులు ఇవ్వాలని కోరారు. మొత్తం 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేసింది. రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయమయ్యే ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేబినేట్ ఆమోదంతో పాటు ఫైనాన్సియల్ అప్రూవల్ ఇవ్వాలని, దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు వెంట ప్రతిపాదనల్లో ఉన్న రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును వీలైనంత తొందరగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వీధి కుక్కల దాడి ఘటనపై స్పందించిన సిఎం

- బాలుడి ఆరోగ్య పరిస్థితిపై జీహెచ్ఎంసి అధికారుల ఆరా
- మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ హయత్‌నగర్‌లో ప్రేమ్ చంద్‌పై మంగళవారం వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బుధవారం సిఎంఒ, జీహెచ్ఎంసీ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఖర్చుకు వెనుకాడకుండా మెరుగైన వైద్యం అందించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బాలుడి వైద్య ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షించాలని చెప్పారు. బాలుడి కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సిఎం సూచించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి కూడా ఈ ఘటనపై వివరాలు తెలుసుకుని.. బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష

బాలుడు ప్రేమ్ చంద్ ఆరోగ్య పరిస్థితిపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి వకీల్‌తో సమీక్షించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి సిఎం స్వయంగా ఆరా తీశారు. బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కమిషనర్ సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని బహిరంగ ప్రదేశాలలో వీధి కుక్కలు లేకుండా ఇప్పటికే చేపట్టిన డ్రైవ్‌ను మరింత ముమ్మరం చేయాలన్నారు.

మహారాజశ్రీ చోడవరం 9వ ఎడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.224/2019

Between :

పూసర్ల నూకయ్యశెట్టి ... అప్పిలెంటు

And

పూసర్ల రామారావు వగైరా ... రెస్పాండెంట్లు

To

2,3 రెస్పాండెంట్లు

R2- Kadimisetty Venkata padmini, Calling her slef poosarla Venkata Padmini w/o Visweswararao, C/o Gupta Residency, Pragathi Nagar, K.P.H.B Colony, Hyderabad -500090, Telagana state.

R3- Poosarla Sai sravan s/o late Sivaram C/o Kadimisetty Venkata padmini, Calling her slef poosarla Venkata Padmini w/o Visweswararao C/o Gupta Residency, Pragathi Nagar, K.P.H.B Colony, Hyderabad -500090, Telagana state.

U/or 41R1 ప్రకారం అప్పీలు నోటీసు

పై నెంబరు అప్పీలులో అప్పీలు విషయం మీకు తెలియపర్చే నిమిత్తం మీకు పలుమార్లు పై కోర్టు ద్వారా నోటీసు పంపినప్పటికీ, మీరు బుద్ధి పూర్వకంగా తీసుకొనక తప్పించుకు తిరుగుచూయున్నందున యీ ప్రకటన మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు అప్పీలు తే 22-12-2025దికి వాయిదా అయ్యి వున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30ని॥లకు మీరు పై కోర్టు నందు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు పై నెంబరు అప్పీలు తీర్మాణించడమగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Chodavaram
Dt : 3/12/2025

K.SRINIVAS
Advocate for Appelant
Cell : 9885830233

కార్మికోద్యమంలో మనుస్మృతి జొప్పించే యత్నం

- 7 నుంచి మెదక్‌లో సిఐటియు రాష్ట్ర మహాసభ
- సంగారెడ్డిలో 2కే రన్ ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర మహాసభలు ఈ నెల ఏడవ తేదీ నుంచి మెతుకు సీమలో నిర్వహించనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను చుక్క రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికుల హక్కులను తొలగిస్తున్నాయని విమర్శించారు. శ్రమచేసే వాడికి విలువ లేని పరిస్థితిని సమాజంలో సృష్టిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. యజమాని ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తూ ఆయన చెప్పిందే వేదవాక్కు అనేలా తేనే పూసిన కత్తిలాగా ఇవాళ మనుస్మృతిని కార్మిక చట్టాల్లో చొప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చికాగో నగరంలో కార్మికులు పోరాడితే ఐఎల్ఓ చేసిన తీర్మానం ప్రకారం ఎనిమిది గంటల పని విధానం వచ్చిందని గుర్తుచేశారు. 'హైర్ అండ్ ఫైర్' అనేది భారతదేశ విధానం కాదని, ఇది అమెరికాలో ఉన్నదని తెలిపారు. ఇలాంటి పెట్టుబడిదారీ దేశాల చట్టాలను మోడీ మన దేశంలోనూ చొప్పిస్తూ కార్మికుల మీద యుద్ధం ప్రకటిస్తున్నారని విమర్శించారు. కార్మికులు తమ హక్కుల కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధమని, హక్కులను మాత్రం వదులుకోబోమని స్పష్టం చేశారు. చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో భవిష్యత్తులో ఐక్య పోరాటాలు నిర్మించడానికి మెతుకు సీమ వేదిక కాబోతుందని తెలిపారు. కాబట్టి, ఈ మహాసభలను జయప్రదం చేయడానికి ప్రతి కార్మికుడు, సిఐటియు కార్యకర్త బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మల్లేశం, జి.సాయిలు, ఉపాధ్యక్షులు ఏ.మాణిక్యం, బాగారెడ్డి, నాయకులు యాదగిరి, ఎం.నర్సింలు, ఎ.నాగభూషణం, ప్రసన్న, సురేష్, దత్తు, వివిధ కంపెనీల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు టిటిఎఫ్‌తో ఏరోవాకేర్ జట్టు

హైదరాబాద్ : క్షయవ్యాధి కారణంగా ప్రాణాలను కోల్పోకుండా, క్షయ రహిత ప్రపంచాన్ని సృష్టించాలనే సామాజిక దృక్పథంతో ట్రాన్స్‌ఫార్మింగ్ టుమారో ఫౌండేషన్ (టిటిఎఫ్)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఏరోవాకేర్ అనే వైద్య సంస్థ తెలిపింది. టిటిఎఫ్‌తో జట్టుకట్టడం ద్వారా క్షయవ్యాధిని సమూలంగా నివారించడానికి, తొలగించడానికి.. కమ్యూనిటీలు, వైద్యులు, ఆవిష్కర్తలను ఐక్యం చేసి మార్పు తీసుకురావడానికి ఏరోవాకేర్ అడుగులు వేస్తుందని ఎరోవాకేర్ కో ఫౌండర్ శ్రీక్షిత సోలిపురం తెలిపారు.

ఏరోవాకేర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిటీ హెల్త్ సేవలను బలోపేతం చేస్తోందన్నారు. ట్రాన్స్‌ఫార్మింగ్ టుమారో ఫౌండేషన్‌తో మా భాగస్వామ్యం ఉమ్మడి విలువలను, ఆరోగ్యం, ఆశాయాన్ని సాధించడంలో ఎవరూ వెనుకబడి ఉండకూడదనే నిబద్ధతను ఒకచోట చేర్చిందని ఏరోవాకేర్ మరో సహ వ్యవస్థాపకులు మాయా చిటోర్ తెలిపారు.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో మార్కాపురం

EA. No : /2025
EP. No : 3/2023
OS. No : 67/2018

Between

పూడి ప్రదీప్ కుమార్ ..... పిటిషనర్ /D.H.R

వర్సెస్

కొండ్ర నాసరయ్య (డైడ్) ... రెస్పాండెంట్స్/J.D.R

To

కొండ్రహరిత, 45 సం॥ పైబడిన వ్యక్తి W/o వెంకటస్వామి D/o లేటు నాసరయ్య, హౌస్ వైఫ్, R/o డోర్ నెంబర్ 9/46, హరిజన పాలెం మార్కాపురం టౌన్,
ప్రస్తుత నివాసం : HNo : 38/18/B, రోహిణి కాలనీ, సైనిక్‌పూరి హైస్కూల్ రోడ్డు, అంబేద్కర్ నగర్, సైనిక్ పూరి, హైదరాబాద్, TG స్టేట్ 500094,

పైనెంబర్ EP పిటిషన్‌ను DHR రైన దాఖలు పరచగాJDR.1చనిపోయినందున మీయొక్క నోటీసు కొరకు డి.హెచ్.ఆర్ఎన్నిమార్లు నోటీసులు మీకు పంపిననూ మీరు అందుకోని కారణంగా గౌరవ కోర్టు వారు మీ యొక్క నోటీసు మరియు హాజరు నిమిత్తం పత్రికా ప్రకటనకు గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఇవ్వడమైనది. కావున మీరు గాని మీ తరఫున లాయర్ గాని తేదీ: 19-12-2025న ఉదయం 10.30 నిమిషాలకు ప్రత్యక్షంగా గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకునవలెను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడుదని తెలియడమైనది

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

మార్కాపురం
తేదీ : 04-12-2025

ఇట్లు
తేళ్ల జోసెఫ్
మదిరే శ్రీరామరెడ్డి
అడ్వకేట్స్, మార్కాపురం

రెండో దశ సర్పంచ్ నామినేషన్లు 25,654

- అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 1,387
- అత్యల్పంగా సంగారెడ్డిలో 1,447
- డిసెంబర్ 6న అభ్యర్థుల తుది జాబితా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండో దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. చివరి రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు రెండోదశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు బుధవారం వెల్లడించారు. సర్పంచ్ పదవి కోసం 28,278 నామినేషన్లు, వార్డు స్థానాలకు 93,595 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి అత్యధికంగా నల్లగొండ జిల్లాల్లో 2,116 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ జిల్లాలో రెండు రోజుల్లో 883 నామినేషన్లు దాఖలు కాగా, చివరి రోజు 1,233 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత అత్యధిక నామినేషన్లు దాఖలైన రెండో జిల్లాగా సూర్యాపేట నిలిచింది. ఈ జిల్లాల్లో 181 గ్రామ పంచాయతీలకు 1,447 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో 243 జీపీలకు గాను 1,444 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా ముగులు జిల్లాలో 52 జీపీలకు గాను 288 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డుల వారీగా రెండోదశలో మొత్తం 38,342 వార్డులకు 93,595 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధిక నల్లగొండ జిల్లాలో 2,418 వార్డులకు గాను 6,120 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో 2,164 వార్డులకు గాను 4,965 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా ములుగులో 420 వార్డు స్థానాలకు గాను 1,109 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. సర్పంచ్, వార్డు మెంబర్లకు దాఖలైన నామినేష్ల పరిశీలన బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. పరిశీలన పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘం అధికారులు సక్రమంగా ఉన్న నామినేషన్ల వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

రెండో దశ అప్పీళ్లు నేటి నుంచి...

తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థి సంబంధిత రెవెన్యూ డివిజనల్, సబ్ కలెక్టర్ వద్ద రిటర్నింగ్ అధికారిపై డిసెంబర్ 4న అప్పీల్ చేసుకోవచ్చు. డిసెంబర్ 5న అప్పీళ్లను పరిష్కరిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించి ఆల్ఫాబెటికల్ వారీగా ఎన్నికల గుర్తులను కేటాయిస్తారు.

కార్మికులను బానిసలుగా మార్చేలా లేబర్ కోడ్‌లు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చేలా.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మెదక్ పట్టణంలో జరిగే సిఐటియు రాష్ట్ర ఐదో మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ నుంచి 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్‌తో నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేస్తూ తుంగలో తొక్కిందన్నారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారుల ప్రయోజనానికే ఈ కోడ్‌లు అన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులను సన్నద్ధం చేసేందుకు ఈ మహాసభలో చర్చలు జరుగుతాయన్నారు. డిసెంబర్ 7న మెదక్ పట్టణంలో జరిగే కార్మిక బహిరంగ సభకు రాష్ట్రంలోని అశేష కార్మికవర్గం హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక సామాజిక ఉద్యమాలు, కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు పద్మశ్రీ, ఎం.వెంకటేష్, శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎం దశరథ్, జె కుమారస్వామి, నగర కోశాధికారి కె అజయ్ బాబు, నాయకులు మల్లేష్, జి నరేష్, శ్రీనివాస్, అజయ్ బాబు, పి మల్లేష్, సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులె మనోహర్ రెడ్డి, వాకర్స్ క్లబ్ సెంట్రల్ గవర్నర్ శైలజ, మాజీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి వీరయ్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి, ఉద్యోగాలకు ఊతం

- మేనేజ్‌మెంట్ విద్యలో అగ్రగామి ఐపిఇ
- 50 వర్సిటీలతో ఎంఒయులు
- ఉచితంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ : ప్రొ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం దేశవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ విద్యకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఆకర్షించేందుకు ఎన్నో విద్యా సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, వాటికంటే భిన్నంగా నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలను విద్యార్థులకు అందించడంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపిఇ) ముందంజలో ఉంది. హైదరాబాద్ నగర శివారులోని శామీర్‌పేటలో 22 ఎకరాల విస్తీర్ణంలో ఈ విద్యాసంస్థ నెలకొల్పబడింది. అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని అర్హతలు, అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో విద్యను అందిస్తూ, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ రూపకల్పన చేస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస మూర్తి తెలిపారు. "వికసిత్ భారత్-2047" లక్ష్య సాధన దిశగా ఐపీఈ అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. "ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు కొదవ లేదు.. అది కూడా ఆకర్షణీయమైన ప్యాకేజ్‌లతో ఉంటుంది" అని.. శ్రీనివాసమూర్తి 'నవతెలంగాణ'తో అన్నారు. ఆయన మాటల్లోనే..

"ఐపిఇ సంస్థ విద్యార్థులను కేవలం ఉద్యోగులుగానే కాక సమాజానికి ఉపయుక్తమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం. బోధన, పరిశోధన, శిక్షణ, కన్సల్టింగ్ రంగాల్లో ఐపిఇ నిరంతరం కృషి చేస్తోంది. ఎందరో నిష్ణాతులైన విద్యార్థులను ప్రపంచానికి అందిస్తూ.. ఇంకొందరిని ఎంటర్ ప్రెన్యూర్స్ చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తోంది.." అని అన్నారు.

మార్పులను అందిపుచ్చుకుంటూ..

ఐపిఇ 1964లో స్థాపించినప్పటి నుంచి సమాజ నిర్మాణానికి, శ్రేయస్సుకు, విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతూ వస్తోంది. విద్యారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని దానికి అనుగుణంగానే రూపాంతరం చెందుతోంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ నుంచి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ గుర్తింపు పొందింది. ఐసిఎస్ఎస్ఆర్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ప్రోత్సహించింది. నిధులు భారీగా అందించింది.

అలరించే కోర్సులు

ఐపిఇ రెండేళ్ల వ్యవధి కలిగి ఉన్న 6 ఫుల్‌టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులను ఆఫర్ చేస్తోంది. వీటిలో పిజిడియం, పిజిడిఎం/ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, పిజిడిఎం/ ఇంటర్నేషనల్ బిజినెస్, పిజిడిఎం-మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, పిజిడిఎం హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, పిజిడిఎం-బిజినెస్ ఎనలాటిక్స్ కోర్సులను అందిస్తోంది. ఐపిఇ ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (పీహెచ్‌డీ ప్రోగ్రాం) అందిస్తోంది.

అందుబాటులో 40వేల పుస్తకాలు

ఐపీఈ అకాడమిక్ అండ్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఆధునిక నాలెడ్జి సెంట్రల్ లైబ్రరీ కలిగి ఉంది. ఇందులో జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్, 40,000 పుస్తకాలు, విద్యార్థులకు ఉపయోగకరమైన ఎలక్ట్రానిక్స్ డేటా బేసెస్ ఉన్నాయి. ఆడిటోరియం, ఇండోర్, ఔట్ డోర్ క్రీడా స్థలాలు ఉన్నాయి. క్యాంపస్‌లో విద్యార్థినులు, విద్యార్థులు వేర్వేరుగా ఉండేందుకు ఆధునిక హాస్టల్స్ సౌకర్యాలున్నాయి. బోర్డు గవర్నర్లకు ప్రెసిడెంట్‌గా రిటైర్డ్ ఐఏఎస్.. ఉమ్మడి ఏపి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ఉన్నారు.

భారీగా ప్లేస్‌మెంట్స్

ఇక్కడ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోనే 95 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందుతారు. ఉత్తమ ప్యాకేజి కోసం డ్యూయల్ స్పెషలైజేషన్‌తో మొత్తం ఎనిమిది స్పెషలైజేషన్స్‌తో ఇక్కడ ప్రతి విద్యార్థి రెండు అంశాల్లో నిష్ణాతులై ఉండేలా తయారు చేస్తున్నామని డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసమూర్తి తెలిపారు. నిత్యం ఇక్కడికి వచ్చే కంపెనీలు, పరిశ్రమల సంఖ్య మరింతగా పెరగడంతోపాటు డెలాయిట్ కంపెనీనే సుమారు వంద మందికి పైగా విద్యార్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటోందని తెలిపారు. అలాగే పీడబ్ల్యూసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఫెడరల్ బ్యాంక్, మెట్రిక్ అనలిటిక్స్, గ్లోబల్ డేటా వంటి ప్రముఖ సంస్థలు ప్రతి సంవత్సరం విద్యార్థులను అధిక వేతన ప్యాకేజీలతో నియమించుకుంటున్నాయని చెప్పారు.

50 వర్సిటీలతో ఒప్పందం

ఐపిఇ దేశవ్యాప్తంగా 50 యూనివర్సిటీలు, ప్రభుత్వ కళాశాలలతో ఎంఓయూలు కుదుర్చుకుని ఉచిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు పది వేల మంది ఫ్యాకల్టీకి నాణ్యమైన శిక్షణ అందించిన ఘనత సంస్థకు దక్కింది. ఎస్ఏక్యూఎస్ అక్రిడిటేషన్ కలిగిన ఐపిఇ డిగ్రీలకు సార్క్ దేశాల్లో గుర్తింపు ఉంది. నేపాల్, శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా లాంటి దేశాల్లో మేనేజ్‌మెంట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్టు డైరెక్టర్ తెలిపారు.

పరిశ్రమల అవసరానికి తగ్గట్టుగా..

పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకుని ఐపీఈలో కోర్సులకు రూపకల్పన జరుగుతోంది. ఎఐ, లీడర్‌షిప్, రీసెర్చ్ మెథడాలజీ వంటి అంశాల్లో శిక్షణ ఉంటోంది. విద్యార్థులు ప్రతిభతో కార్పొరేట్ రంగంలో రాణించడమే కాకుండా, సామాజిక బాధ్యతను విస్మరించకుండా, వారిని ఆ రంగాల్లో నిష్ణాతులుగా తయారు చేస్తోంది. ఇక్కడ రెండేండ్లలో విద్యార్థులు, అనేక స్టూడెంట్స్ క్లబ్స్ (ఉదాహరణకు మార్కెటింగ్, ఫైనాన్స్ క్లబ్, యచ్ ఆర్ క్లబ్, ఆపరేషన్ క్లబ్) ద్వారా అనేక అంశాలు నేర్చుకుంటారు. ఐపిఇలో ప్రధానంగా బోధన, శిక్షణ, కన్సల్టింగ్, పరిశోధన అనే నాలుగు ప్రధాన అంశాలు ఉంటాయి. ఇక్కడ చదివిన విద్యార్థులు ఈ నాలుగు అంశాల్లో పట్టు సాధిస్తునారని డైరెక్టర్ వివరించారు.

AXIS BANK

ప్లాట్ నం.41, సేశాద్రి రోడ్, ఆనంద్ రావు సర్కిల్, బెంగళూరు-560009.

స్వాధీనతా ప్రకటన **అనుబంధం-4, రూల్8(1)**

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేదీ: 03.05.2024 నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, **(1) మిస్ అరవింద గుండ,** తండ్రి శ్రీ సత్యనారాయణ గుండ, ఆదర్శ్ రెసిడెన్సీ, ఫ్లాట్ ఎ301, 2వ మెయిన్ రోడ్, 47వ క్రాస్, జయానగర్, 8వ బ్లాక్, బెంగళూరు, కర్నాటక-560082. **మరియు: మిస్ అరవింద గుండ,** తండ్రి శ్రీ సత్యనారాయణ గుండ, 1-7-145/4/ఎ, శ్రీనివాస కాలనీ, జమిస్తాన్‌పూర్ పోస్టు, హైదరాబాద్-500020. **మరియు: మిస్ అరవింద గుండ,** తండ్రి సత్యనారాయణ గుండ, డి.607, ఫ్లాట్ నం.607, 6వ అంతస్తు, ఎమెరాల్డ్ హైట్స్, బ్లాక్-డి, సర్వే నం.1106, ఏదులాబాద్ గ్రామం యొక్క ఘనపూర్ హామ్లెట్, హైదరాబాద్. **(రుణగ్రహీత/ తాకట్టుదారు), (2) శ్రీ సత్యనారాయణ గుండ,** తండ్రి శ్రీ రామయ్య, ఆదర్శ్ రెసిడెన్సీ, ఫ్లాట్ ఎ301, 2వ మెయిన్ రోడ్, 47వ క్రాస్, జయానగర్, 8వ బ్లాక్, బెంగళూరు, కర్నాటక-560082. **మరియు శ్రీ సత్యనారాయణ గుండ,** తండ్రి శ్రీ రామయ్య, 1-7-145/4/ఎ, శ్రీనివాస కాలనీ, జమిస్తాన్‌పూర్ పోస్టు, హైదరాబాద్-500020. **మరియు: శ్రీ సత్యనారాయణ గుండ,** తండ్రి శ్రీ రామయ్య, డి.607, ఫ్లాట్ నం.607, 6వ అంతస్తు, ఎమెరాల్డ్ హైట్స్, బ్లాక్-డి, సర్వే నం.1106, ఏదులాబాద్ గ్రామం యొక్క ఘనపూర్ హామ్లెట్, హైదరాబాద్. **(సహ-రుణగ్రహీత)** అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా **27.04.2024** నాటికి బకాయి మొత్తాలుగా రుణ ఖాతా నం.లు **PH0090100077134** నకు గాను నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.7,22,201.54 పై.లు (రూపాయలు ఏడు లక్షల ఇరువై రెండు వేల రెండు వందల ఒకటి మరియు యాభై నాలుగు పైసలు మాత్రమే)** లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6&8తో చదువబడే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **02 డిసెంబర్ 2025న స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **27.04.2024** నాటికి బకాయిగా **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ కు రూ.7,22,201.54 పై.లు (రూపాయలు ఏడు లక్షల ఇరువై రెండు వేల రెండు వందల ఒకటి మరియు యాభై నాలుగు పైసలు మాత్రమే)** లను మరియు దానిపై వడ్డీతో చెల్లించుటకులోబడి ఉంటుంది.

సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, సర్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీ శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

ఆస్తి PH0090100077134 వివరణ

శ్రీ అరవింద గుండ తండ్రి శ్రీ సత్యనారాయణ గుండ పేరుగలది.

రంగారెడ్డి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, ఘనపూర్ గ్రామపంచాయతి, ఏదులాబాద్ గ్రామం యొక్క ఘనపూర్ హామ్లెట్, సర్వే నం.1106 (పి) వద్దగల 'ఎమెరాల్డ్ హైట్స్' పేరున నివాసిత అపార్టుమెంట్ సమూదాయం యొక్క సుమారు 350చ.అ.ల విస్తీర్ణం పార్కింగ్ పార్ట్, రిజర్వుడ్ కార్ పార్కింగ్ స్లాట్ నం. సి2డి 28.29 మరియు 62.5చ.గ.ల విస్తీర్ణంతో విడదీయలేని ల్యాండ్ సరాసరి భాగంతోపాటు 402చ.అ.ల ఉమ్మడి ఏరియా మరియు 1493చ.అ.ల విస్తీర్ణపు నిర్మాణ ఏరియా, బ్లాక్ 'డి' లో 6వ అంతస్తు పై నం.607 గల అసంపూర్తి అపార్టుమెంట్. ఉత్తరం: లిఫ్టు, దక్షిణం: ఒపెన్ టు స్కై, తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర: కారిడార్.

ఏవేని సందేహాల కొరకు, దయచేసి సంప్రదించండి: శ్రీ ప్రేమ్, మొబైల్ నం.8880051234.

తేది: 02.12.2025,
ప్రదేశం: బెంగళూరు

సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

జనవరిలో భూ భారతి యాప్

- స్థానిక ఎన్నికల తర్వాత రైతులకు 'భూధార్' కార్డులు
- భూసమస్యలపై ట్రిబ్యునల్ ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు భూరికార్డు, సర్వే, రిజిస్ట్రేషన్
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతులకు భూధార్ కార్డులను పంపిణీ చేస్తామని రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. తొలుత నక్షా లేని ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని అన్నారు. ఆ గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులతోపాటు సరిహద్దులు, కొత్త సర్వే నంబర్లను కేటాయిస్తామని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండేండ్లలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తెచ్చామని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను రెండేండ్లలో పునర్నిర్మించామని అన్నారు. భూహక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు సమూల సంస్కరణలను అమలు చేశామని వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. విదేశీ సంస్థ రూపొందించిన ధరణి పోర్టల్ యాప్‌ను బంగాళాఖాతంలో వేశామని, దాని స్థానంలో జనవరి నాటికి భూభారతి కొత్త యాప్‌ను తెస్తామనీ, ఇందుకు సంబంధించి ఎన్ఐసి కసరత్తు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో 413 గ్రామాల్లోని భూములకు నక్షాలు లేవని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాలను ఎంపిక చేశామనీ, నక్షాలతోపాటు భూమికి సరిహద్దులు, సర్వేనెంబర్లను కేటాయిస్తామని వివరించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులను సిద్ధం చేశామనీ, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిణీ చేస్తారని చెప్పారు. పట్టణాల్లో ఉన్న వాటిని తీసేస్తే మిగిలిన 373 గ్రామాల్లో రెండో విడతలో భూధార్ కార్డుల పంపిణీ చేపడతామని అన్నారు. మూడో విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున వివాదం లేకుండా అభద్రత లేకుండా భూభారతి చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఆ తర్వాత అన్ని గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులిస్తామని చెప్పారు. ఆలస్యమైనా పారదర్శకంగా ఈ ప్రక్రియను చేపడతామని అన్నారు.

డిసెంబర్ నాటికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తాం

రాష్ట్రంలో 10,543 రెవెన్యూ గ్రామాలున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు. ఆరు వేల మంది విఆర్‌ఒలను నియమించామని అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం 10,400 మంది దరఖాస్తు చేశారని వివరించారు. మొదటి విడతలో 3,490 మంది అర్హత సాధించారని అన్నారు. ప్రతి మండలానికి నలుగురు లేదా ఆరు మంది సర్వేయర్లున్నారని చెప్పారు. మరో 2,500 మంది సర్వేయర్లను డిసెంబర్ చివరినాటికి నియమిస్తామని వివరించారు. భూసర్వేకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామన్నారు. అందుకోసం 400 రోవర్లను కొనుగోలు చేశామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం వాటిని కొనుగోలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలోని 2.29 కోట్ల సర్వే నెంబర్లకు భూధార్ నెంబర్లను కేటాయించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. తన కుమారుడిపై వచ్చిన ఆరోపణలకు స్పందిస్తూ, నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాడు, నిజం నిలకడ మీద తెలుస్తుంది...అని పొంగులేటి తెలిపారు. తెలంగాణలో బిజెపి బలమేంటో తెలియంది ఎవరికి అని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

జనవరి నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్రంలో ఇంత వరకు భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరుకల్లా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. సమస్యలున్న వాటి కోసం ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలను వెలికితీసేందుకు ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందనీ, వాటి ఫలితాలను గమనించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా తొమ్మిది లక్షల దరఖాస్తులొచ్చాయని అన్నారు. అందులో న్యాయపరమైన చిక్కులున్న వాటిని గుర్తించి సరైన సమాధానంతో తిరస్కరించామని చెప్పారు. 6.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సాదాబైనామాకు 9.25 దరఖాస్తులొచ్చాయని వివరించారు. ఇబ్బందుల్లేని దరఖాస్తులను పరిష్కరిస్తామని చెప్పారు. అవసరమైతే జీవోను సవరిస్తామని అన్నారు. 58, 59 జిఒలకు సంబంధించిన దరఖాస్తుల్లో పారదర్శకంగా ఉన్న వాటిని పరిష్కరిస్తామని వివరించారు. 111 జిఒ పరిధిలోని భూములకు సంబంధించి చట్టప్రకారమే నడుచుకుంటామని అన్నారు. 1/70 చట్టానికి సంబంధించి కమిటీ వేస్తామని చెప్పారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి నిరీక్షించే పరిస్థితి రాకుండా స్లాట్ బుకింగ్ విధానాన్ని తెచ్చామని వివరించారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మూడు దశల్లో ఈ స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా నిర్మిస్తున్నామని అన్నారు. హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ మంత్రి ముడుపులు ఇచ్చిన వారికే ల్యాండ్ కన్వర్షన్ చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో అందరికీ ల్యాండ్ కన్వర్షన్ చేసుకునేందుకు అవకాశం కల్పించామనీ, అవినీతి తావెక్కడ ఉందని ప్రశ్నించారు. నాడు చేసిన ల్యాండ్ కన్వర్షన్ వివరాలను బయటపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో బాంబు కలకలం..!

- రైల్వే స్టేషన్‌లో బాంబును కొరికిన కుక్క మృతి
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దు : ఎస్‌పి రోహిత్ రాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో నాటు బాంబులు కలకలం సృష్టించాయి. చెత్తకుప్పలో తినే పదార్థంగా భావించి ఓ వీధి కుక్క బాంబును కొరకడంతో అది పేలింది. దాంతో అక్కడికక్కడే కుక్క మృతి చెందింది. ఈ ఘటన కొత్తగూడెంలో సంచలనం రేపింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు, త్రీటౌన్ పోలీసులు, డాగ్, బాంబ్‌స్క్వాడ్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ బాంబులు అక్కడకి ఎలా వచ్చాయో విచారణ చేపట్టారు. కాగా, రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా పడి ఉన్న సంచులను రైల్వే పారిశుధ్య సిబ్బంది చెత్తకుప్పలో పడేశారు. మూడు సంచుల్లో ఐదు బాంబులు ఉండగా, ఒక బాంబును కుక్క కొరికింది. మరో నాలుగు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఉదయం వెళ్లే రైలులో నాటు బాంబులను తరలించేందుకు ఎవరో ప్రయత్నించి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా విచారణ చేస్తున్నట్టు కొత్తగూడెం త్రీ టౌన్ సిఐ శివ ప్రసాద్, వన్ టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. ఈ ఘటనలో మరే విధమైన కోణం లేదని నిర్ధారించారు. ఎవరూ కూడా సోషల్ మీడియాలో ఈ విషయంపై తప్పుడు ప్రచారం చేయొద్దని ఎస్‌పి రోహిత్ రాజు కోరారు.

ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తున్న సిఎంపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్‌కు కవిత ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లా కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల తరుపున సిఎం సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. డిసెంబర్ ఒకటిన మహబూబ్ నగర్ జిల్లాలో, డిసెంబర్ రెండున ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రచారం చేశారని గుర్తు చేశారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరుతో గ్రామీణ ఓటర్లను ప్రలోభపెట్టే పనులు చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లోనూ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన సభలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇకముందు నిర్వహించబోయే సభల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుతో పాటు వివిధ సభల్లో సిఎం మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్‌ను ఆమె జత చేశారు.

సిపిఎంలో చేరుతున్న విప్పలమడక గ్రామస్తులు

విప్పలమడకలో వంద కుటుంబాలు సిపిఎంలో చేరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడక గ్రామంలో మాజీ సర్పంచ్ ముత్తమల సంపూర్ణ, విజయరాజు దంపతులతో పాటు వంద కుటుంబాలు మంగళవారం రాత్రి సిపిఎంలో చేరారు. వారికి సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్.. పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ విప్పలమడక గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ముత్తమాల సంపూర్ణను ప్రకటించారు. వార్డు మెంబర్లుగా ముత్తమాల సరితకుమారి, మేరీ, పత్తిపాటి శాంతకుమారి, ముత్తమాల దేవానందం, ముత్తమాల పుష్పరాజ్, సత్తెనపల్లి మాధవి, ముత్తమాల వెంకటరత్నం, కంచె ఏసుమణి, తేల్లూరి వెంకటి, తేళ్లూరి కుమారిని ప్రకటించారు. సిపిఎం అభ్యర్థులకు బిఆర్ఎస్, జనసేన పార్టీ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు మాట్లాడుతూ.. గత 50 సంవత్సరాల నుంచి సిపిఎం పరిపాలనలో విప్పలమడక గ్రామపంచాయతీ ఉందని, మళ్లీ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థిని గెలిపించి గరిడేపల్లి వారసత్వాన్ని నిలపాలని కోరారు. తొలుత గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్, గరిడేపల్లి వెంకటేశ్వరరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, వైరా డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు బాణాల వెంకట్రావమ్మ, ద్రోణాదుల నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి గరిడేపల్లి సుబ్బారావు, పారుపల్లి నాగేశ్వరరావు, మేడ రాంబాబు, మాజీ ఎంపీటీసీ బూర్గు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐఎల్‌టిపి పేరుతో తక్కువ ధరకు భూముల అప్పగింత

- రూ.5 లక్షల కోట్ల భారీ నష్టం కలిగేలా ప్రభుత్వ చర్యలు
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పరిధిలోని సుమారు రూ.ఐదు లక్షల కోట్ల భూములను 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్ఐఎల్‌టిపి) పేరుతో ప్రయివేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు చేస్తున్నదని ఎమ్మెల్సీ, శాసనమండలిలో బిఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలిలోని పారిశ్రామికవాడలో బుధవారం కార్పొరేటర్లు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజలతో కలిసి వారు పర్యటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మధుసూదనాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతాల్లోని కోట్ల రూపాయల విలువైన భూములను తక్కువ ధరకు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ఎస్ఆర్ఓ రేటు 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి రాష్ట్ర ప్రజలకు రూ.ఐదు లక్షల కోట్ల భారీ నష్టం కలిగించే కుట్ర చేస్తోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్లు, గిరిజన-దళిత గురుకుల పాఠశాలలు, లైబ్రరీలు, యుపిహెచ్‌సి ఆస్పత్రుల కోసం భూమి లేదని చెప్పే ప్రభుత్వం.. వేల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను మాత్రం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశ్రామికవాడల ఏర్పాటుకు ప్రజలు నమ్మకంతో ఇచ్చిన భూములను, ప్రభుత్వం అప్పట్లో చేసిన కేటాయింపులను, వాటి అసలు ఉద్దేశాలను ఇప్పుడు పూర్తిగా విస్మరించి, రియల్ ఎస్టేట్‌కు మళ్లించడం కాంగ్రెస్ ప్రభుత్వ దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మేకల సునీత రాముయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, బిఆర్ఎస్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, రావుల అంజయ్య, జెఎసి వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, జికె హనుమంత్ రావు పాల్గొన్నారు.

వేడుకగా దిశా వాకథాన్ 2025

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో తొలిసారి వికలాంగుల వాకథాన్ 'దిశా వాకథాన్ 2025' ను హెచ్‌సిఏహెచ్ సువిటాస్ వేడుకగా నిర్వహించింది. సంజీవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వాకథాన్‌లో 50 మంది వికలాంగులు, 50 మంది వాలంటీర్లు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ వాకథాన్ తర్వాత, సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ అండ్ రికవరీ నిపుణులు గైటర్‌తో సహా రోబోటిక్ మొబిలిటీ సిస్టమ్‌లను ప్రదర్శించారు.

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఇద్దరు సర్వేయర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ రైతు వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఇద్దరు సర్వేయర్లు ఎసిబికి చిక్కిన ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మెదక్ ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. డిజిటల్ సర్వే కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతు వద్ద సర్వేయర్ శ్రీనివాస్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మెదక్ ఎసిబి డిఎస్‌పి కార్యాలయంకు వచ్చి రైతు ఫిర్యాదు చేశాడు. ట్రైనీ సర్వేయర్ గౌరీ శరత్ కుమార్ గౌడ్‌కు రూ. 20 వేలు ఇవ్వాలని శ్రీనివాస్ సూచన చేయడంతో డబ్బులు రైతు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. ట్రైనీ సర్వేయర్‌తో పాటు సర్వేయర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారించామని డిఎస్‌పి తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పట్టుబడ్డ ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు చెప్పారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కారు దగ్ధమైన ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం నుంచి హైదరాబాద్ కారులో వెళ్తుండగా మండలంలోని మక్తమాధారం గేట్ సమీపంలో బుధవారం ప్రమాదవ శాత్తు ఒక కారు అకస్మాత్తుగా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. కారు ముందు భాగం నుంచి పొగ రావడం గమనించిన ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే వాహనం ఆపి బయటకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. కొద్దిసేపటికే మంటలు పూర్తిగా కారును చుట్టుముట్టడంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

బిసిలను మోసం చేస్తున్న బిజెపి, కాంగ్రెస్

- జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, కాంగ్రెస్ పార్టీలు బిసిలను మోసం చేస్తున్నాయని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రితో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి బిసి రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కనీసం ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీతోనూ సమావేశమైన ముఖ్యమంత్రి పార్లమెంటులో నిలదీయాలని కోరలేదని తెలిపారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నందునే బిజెపిని కాంగ్రెస్ నిలదీయడం లేదని ఆయన ఆరోపించారు. ఆ రెండు పార్టీల కపట నాటకాన్ని ఎండగడతామని హెచ్చరించారు.

వివాదాస్పద ప్రొసీడింగ్స్ రద్దు చేయండి

- తెలంగాణ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి జారీ చేసిన వివాదాస్పద ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.మురళీకృష్ణ, ముఖ్య సలహాదారు డాక్టర్ పార్వతీ సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షులు పి.రాజ భానుచంద్ర ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జి.హేమచంద్రుడు బుధవారం పాఠశాల విద్య సంచాలకులకు లేఖ రాశారు. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను మధ్యాహ్నం సెషన్స్‌కు హాజరు కావాలని డిఇఒ ప్రొసీడింగ్స్ ఇచ్చినట్టు వారు తెలిపారు. అయితే సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జారీ చేసిన రెగ్యులర్ స్కూల్స్ అవర్స్‌లో హాజరు కావాలన్న ఆదేశాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి ప్రొసీడింగ్స్ వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు.

సాకులు చెప్పొద్దు.. అభివృద్ధి చేయాల్సిందే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎన్నికయ్యే సర్పంచ్.. అభివృద్ధి విషయంలో సాకులు చెప్పొద్దు.. ప్రభుత్వం నిధులు రాలేదని చెప్పొద్దు.. అభివృద్ధి చేయాల్సిందే.. అంటూ గ్రామ యువకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో జరిగింది. గెలిచిన వారు తమ సొంత డబ్బులతోనైనా అభివృద్ధి చేయాలని ఫ్లెక్సీ కట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదనే సాకు చెప్పి పనులు చేయకుంటే ప్రశ్నిస్తామని హెచ్చరిస్తూ గ్రామపంచాయితీ ఎదుట పెట్టిన ఫ్లెక్సీ పలువురిని ఆకర్శిస్తోంది. దీర్ఘకాలంగా గ్రామంలో నిలిచిపోయిన, చేయాల్సిన పనులను వివరిస్తూ ఓ ఫ్లెక్సీ పెట్టారు. కొన్ని సంవత్సరాల నుంచి నారాయణపూర్- బండలింగంపల్లి రోడ్డు గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, సర్పంచ్‌గా ఎన్నికయ్యే వ్యక్తి ఆ పనిని వెంటనే చేపట్టేలా చొరవ చూపాలని సూచించారు. వీటితోపాటు అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అర్హులకు అందే పథకాలు పారదర్శకంగా ఉండేలా చూడాలని కోరారు. గ్రామంలో ఏయే పనులు చేయాలో రాశారు.

సర్పంచ్ పోరులో కుటుంబ సభ్యులే ప్రత్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్పంచ్ ఎన్నికల వేళ.. పోటీకి కుటుంబ సభ్యులే ప్రత్యర్థులుగా మారుతున్న పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. తండ్రీకొడుకులు, అన్నదమ్ములు ఎన్నికల్లో పోటీ పడుతుండడంతో ఈ ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పదవి కోసం తండ్రీకొడుకులు పోటీ పడుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన మానెగళ్ల రామకృష్ణయ్య, ఆయన కుమారుడు వెంకటేశ్ నామినేషన్లు దాఖలు చేశారు. వంశపారంపర్యంగా ఆయుర్వేద వైద్యంలో పేరుగాంచిన మానేగాళ్ల రామకృష్ణయ్య గతంలోనూ సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించారు. తండ్రీకొడుకులు ఇద్దరూ తమ విజయంపై ధీమా వ్యక్తం చేస్తూ, గ్రామాభివద్ధికి కషి చేస్తామని హామీ ఇస్తున్నారు. కాగా, ఈ గ్రామంలో మొత్తం పది వార్డులు, 1563 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో సర్పంచ్ పదవికి పది నామినేషన్లు దాఖలయ్యాయి.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో సర్పంచ్ స్థానానికి అన్నదమ్ములిద్దరూ నామినేషన్ వేశారు. కాగా ఖానాపూర్‌కు గత ఎన్నికల్లో ఒసి జనరల్ మహిళ స్థానం కేటాయించగా.. ఐలేని సత్తవ్వ (బిసి) సర్పంచ్‌గా పనిచేశారు. అయితే ఈసారి బిసి జనరల్‌కు అవకాశం లభించడంతో.. సత్తవ్వ కుమారులు ఐలేని యాదగిరి, ఐలేని సతీశ్ ఇద్దరూ పోటీలోకి దిగారు. వీరితోపాటు మరొక బిసి అభ్యర్థిగా బాల్ద మల్లేశం నామినేషన్ దాఖలు చేశారు. మరి కొంతమంది బరిలో ఉన్నప్పటికీ.. వీరి మధ్యే త్రిముఖ పోటీ ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. 1035 మంది వరకు ఓటర్లు ఉన్న ఈ గ్రామంలో ఎవరు గెలుస్తారని ఉత్కంఠ నెలకొంది.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొట్టగా.. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్ వద్ద రాష్ట్రీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుబల్లి మండలం వీఎం బంజర వైపునుంచి అతివేగంగా వచ్చిన కారు కిష్టారంలోని రాష్ట్రీయ రహదారి వద్ద అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టింది. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సాదిక్ (21), సత్తుపల్లి మున్సిపాలిటీలోని కొమ్మేపల్లి కాలనీకి చెందిన సిద్దేసి జాయ్(21), ఆరో తరగతి చదువుతున్న మర్సకట్ల శశివర్ధన్ (12) అక్కడిక్కడే మృతి చెందారు. అన్నపురెడ్డిపల్లికి చెందిన తలారి అజయ్, చంద్రుగొండ మండలం మహబాద్ కాలనీకి చెందిన ఎస్కే ఇమ్రాన్ తీవ్రంగా గాయపడ్డారు. సత్తుపల్లి (కల్లూరు) ఎసిపి వసుంధర యాదవ్ ఫారెబి, సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ఐలు అశోక్, ప్రదీప్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లో పోటీదారుల జోరు

- అసంతృప్తులకు నేతల పదవుల ఎర
- ఉత్కంఠ భరితంగా సూర్యాపేటలో నామినేషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో ముగుస్తుండటంతో స్థానికంగా రాజకీయ వేడి పెరిగింది. రెబల్స్‌ను బుజ్జగించేందుకు అన్ని పార్టీల నేతలు 'ప్లీజ్.. ప్లీజ్" అంటూ ఇండ్లబాట పట్టినా చాలామంది అసంతృప్తులు వెనక్కి తగ్గే సూచనలు కనిపించకపోవడంతో పోటీ ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో తొలి విడతలో 8 మండలాల్లోని 159 గ్రామాల్లో 1384 మంది సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు. 1442 వార్డులకు 3,771 మంది నామినేషన్లు వేశారు. ఈ క్రమంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు రెబెల్స్‌ను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నుంచి సర్పంచ్ అభ్యర్థులుగా గ్రీన్ సిగ్నల్ పొందిన అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థుల ఇంటి బాట పడుతున్నారు. 'ప్లీజ్.. ప్లీజ్ మాకు సహకరించండి' అంటూ బతిమలాడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలో అసంతృప్తులు బరిలో ఉన్నారు. వారిని నిలవరించడానికి రాష్ట్ర, జిల్లా నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాలతో పలు ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థులను పార్టీకి చెందిన సీనియర్ నాయకులు బుజ్జగించే పనిలో పడ్డారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో రెబల్స్ తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ వార్నింగ్‌లు ఇచ్చినా ఫలితం లేదు.

కాంగ్రెస్ పార్టీలో పోటీదారుల జోరు అధికంగా ఉంది. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సర్పంచ్ పదవికి పోటీదారుల లిస్ట్ భారీగా ఉంది. సూర్యాపేటలో మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సంయుక్తంగా కలిసి బరిలో ఉన్న అభ్యర్థులను పిలిచి మాట్లాడుతున్నారు. తుంగతుర్తిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రెబల్స్ తాకిడి అధికంగా ఉంది. ఇక్కడ మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి గ్రూపునకు చెందిన వారు చాలా చోట్ల నామినేషన్లు వేశారు. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుండటంతో ఆ సమయానికి లోపే అసంతృప్తులను చల్లార్చే పనిలో రెండు పార్టీల అధినాయకులు బిజీగా ఉన్నారు.